# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 11-09-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం 2 వేల కోట్ల రూపాయలను కేటాయించనుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- నేపాల్ లో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ వాసులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక విమానాలలో రాష్ట్రానికి తిరుగు పయనమయ్యారు.
- ఆరోగ్య శ్రీ పథకాన్ని తొలగించలేదని మంత్రి కొలుసు పార్థసారధి స్పష్టం చేశారు.
- రానున్న 24 గంటల్లో ఉత్తర కోస్తాంధ్రలో కొన్ని చోట్ల భారీ వర్షం కురిసే అవకాశముందని వాతావరణ విభాగం తెలిపింది.

==========================

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు కోసం రెండు వేల కోట్ల రూపాయలను కేటాయించనున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుత జలాశయాల నిల్వలు, నీటి నిర్వహణ, ప్రాజెక్టుల పురోగతి, భూగర్భజలాలు తదితర అంశాలపై ఈరోజు ముఖ్యమంత్రి తన క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టును రానున్న 2 సంవత్సరాల్లో పూర్తి చేయాలని ఈ సందర్భంగా అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇందుకోసం ఈ ఏడాది వెయ్యి కోట్లు, వచ్చే ఏడాది మరో వెయ్యి కోట్లు ఇస్తామని తెలియజేశారు. అటు పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్... ఇటు ఉత్తరాంధ్ర సుజల స్రవంతి.. ప్రాజెక్టుల నుంచి నీటి లభ్యతను విశాఖ నగరానికి విస్తరించాలన్నారు. వంశధార, నాగావళి, చంపావతి నదులను అనుసంధానం చేస్తూ.. ఈ ప్రాంతంలో అన్ని రిజర్వాయర్లు నింపడం ద్వారా ఉత్తరాంధ్రలో వాటర్ నెట్వర్క్ ఏర్పాటు చేయాలని చెప్పారు. రాష్ట్రంలోని ఏ ప్రాంతంలోనూ నీటి ఎద్దడి అనేది తలెత్తకూడదని... అన్ని కాలాల్లోనూ జల వనరులు సమృద్ధిగా లభించేలా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలని చంద్రబాబు నాయుడు జలవనరుల శాఖ అధికారులకు స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి సమీక్ష అనంతరం రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రస్తుతం 1,031 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయని వెల్లడించారు. రాష్ట్రంలోని భారీ, మధ్య, చిన్న తరహా ప్రాజెక్టుల్లో 79 శాతం నీరు నిల్వ ఉందని చెప్పారు.

సెప్టెంబర్ మొదటివారానికే ఈ స్థాయికి నిండాయని, అలాగే భూ గర్భ జలాలు కూడా గత సంవత్సరంతో పోలిస్తే మెరుగయ్యాయని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

==========================

నేపాల్ లో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ వాసులు ఈరోజు మధ్యాహ్నం ఖాట్మాండు విమానాశ్రయం నుంచి రాష్ట్రానికి బయలుదేరారని అధికారులు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక విమానాలలో మొత్తం 144 మంది విశాఖపట్నం, తిరుపతి విమానాశ్రయాలకు చేరుకోనున్నారు. 104 మంది ముందుగా విశాఖకు చేరుకోగా మిగిలిన 40 మంది తిరుపతి విమానాశ్రయానికి చేరుకొనున్నారు. వారిని ఆయా విమానాశ్రయాల నుంచి వారి స్వస్థలాలకు చేర్చేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని అధికారులు తెలిపారు. నేపాల్ లో చిక్కుకున్న రాష్ట్ర పౌరుల కోసం గత రెండు రోజులుగా ఆర్టీజీఎస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

==========================

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటిని ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16  నెలల్లోనే అమలు చేసిందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఈరోజు రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... విపక్షాలు ఎన్నికల హామీలపై అసత్య ప్రచారం చేస్తున్నాయని అన్నారు. తమ ప్రభుత్వం ఏ ఒక్క పింఛన్ ను తొలగించలేదని, గతంలో ఉన్న పింఛన్లనే కొనసాగిస్తోందన్నారు. పింఛన్ల రూపేణా గత ప్రభుత్వం ఒక నెలకు 1,400 కోట్ల రూపాయలు వెచ్చిస్తే తమ ప్రభుత్వం 2,746 కోట్ల రూపాయలను ఖర్చు చేస్తోందని వెల్లడించారు. ఆరోగ్యశ్రీని తొలగించామని విపక్షాలు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని మంత్రి పార్థసారథి వివరిస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

==========================

విజయవాడ నగరంలోని ఆర్ఆర్‌పేటలో డయేరియా బాధితులు 46 మంది చికిత్స పొందుతున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి నారాయణ తెలిపారు. విజయవాడలోని న్యూ రాజరాజేశ్వరిపేటలో డయేరియా ప్రబలిన ప్రాంతాల్లో ఈరోజు ఆయన పర్యటించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఆర్ఆర్‌పేటలో నీరు కలుషితమైందా లేదా అనేది పరిశీలిస్తున్నామని చెప్పారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. స్థానికంగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని మంత్రి నారాయణ తెలియజేశారు

విరామం

==========================

కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన భావితరం జీఎస్టీ సంస్కరణలపై చిత్తూరు జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సంస్కరణలతో అనేక వస్తువుల ధరలు తగ్గుతాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సామాన్యులపై భారం పడకుండా మంచి నిర్ణయం తీసుకున్నారని  పలువురు ఆకాశాణితో పంచుకున్నారు. ఇందులో భాగంగా చిత్తూరు జిల్లా వాసి నరేంద్ర మాట్లాడుతూ...

(వాయిస్ 36 సెకన్లు)

==========================

ఎస్సీ, ఎస్టీ దివ్యాంగుల చట్టాలపై దేశంలోని అన్ని విద్యా సంస్థల్లో అవగాహన కల్పించాలని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖా మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖా మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ అధ్యక్షతన "వికసిత్ భారత్ 2047" అంశంపై దృశ్య మాధ్యమ విధానంలో జరిగిన సమావేశంలో మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలను ప్రస్తావించారు. అందులో ముఖ్యంగా ఆరోగ్య బీమా పథకాలలో వయో పరిమితిని తొలగించాలని, వయో వందన ఆరోగ్య బీమా అర్హత వయస్సును 70 సంవత్సరాల నుండి 60కి తగ్గించాలన్నారు. మహిళా వృద్ధులకు ప్రత్యేక రాయితీలు కల్పించి తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వాలని సూచించారు. మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్ధాలపై విద్యార్థులకు అవగాహన కలిగించేలా పాఠశాల, కళాశాలల స్థాయిలో పాఠ్యాంశాలను ప్రవేశపెట్టాలన్నారు.

==========================

విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరిగే దసరా ఉత్సవాలకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. దసరా ఏర్పాట్ల పురోగతిని సమీక్షించడానికి అధికారులతో కలిసి కలెక్టర్ ఈ రోజు క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ... భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని, పార్కింగ్ కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు, అలాగే ఆన్‌లైన్ వ్యవస్థను మరింత మెరుగుపరిచేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు.

==========================

దక్షిణ ఒడిసా, ఉత్తర కోస్తాంధ్ర తీర ప్రాంతాలో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రానున్న 24 గంటల్లో ఉత్తర కోస్తాంధ్రలో కొన్ని చోట్ల భారీ వర్షం కురిసే అవకాశముందని వాతావరణ కేంద్ర అధికారి ఎల్.నారాయణ వెల్లడిస్తూ...

(వాయిస్ 34 సెకన్లు)

==========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు స్వల్ప లాభాల్లో ముగిశాయి. ఉదయం సెన్సెక్స్ 81,425 పాయింట్ల వద్ద ప్రారంభమై.... చివరకు 123 పాయింట్లు లాభపడి 81,548 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ 32 పాయింట్లు పెరిగి 25,005 వద్ద ముగిసింది. రూపాయి మారకం విలువ డాలర్‌తో పోలిస్తే 33 పైసలు తగ్గి 88 రూపాయల 44 పైసలుగా ఉంది.

==========================
==========================